వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 20 ఫిబ్రవరి 2024

# ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**వీరబల్లి, ఫిబ్రవరి19,ప్రభాత వార్త :**



మండల పరిధిలోని పెద్దివీడు గ్రామంలో రాయవోటి వీరబల్లె రోడ్డు మార్గంలోని సంఘంవాండ్లపల్లె బస్సు స్టేజ్ కు ఎదురుగా రెడ్డివారిపల్లెకు చెందిన చిన్నబసయ్యగారి రెడ్డెయ్య కుటుంబ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిగుట్ల రెడ్డెయ్య మాట్లాడుతూ ఇది రోడ్డుమార్గం కాబట్టి ఒక ఆలయం నిర్మిస్తే బాగుం టుం దనే ఉద్దేశ్యంతో ఈ పనులు ప్రారంభించామన్నారు. అలాగే ఒక వృద్ధాశ్రమం కూడా నిర్మిస్తామని తెలిపారు. ఒక మంచి పని చేయాలనే ఆలోచనతో ఈ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రమేష్ స్వామి, రెడ్డెయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్లస్థలాల ఆన్‌లైన్‌కు గడువు పొడిగింపు

**కడప ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి (19 ఫిబ్రవరి, 2024) నుండి 26 ఫిబ్రవరి, 2024 (సోమవారం) వరకు అర్హులైన జర్నలిస్టుల నుండి వెబ్ సైట్ లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 జనవరి, 2024 వరకు అంటే నిర్దిష్ట గడువులోగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి మరియు నమోదు చేసుకున్నప్పటికీ సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవ కాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. సంబంధిత జీవోలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయి ఉంటే వారంతా www.ipr.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 26 ఫిబ్రవరి, 2024 వరకు నిర్దిష్ట గడువులోగా తమ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను ప్రతి ఒక్క జర్నలిస్టు పొందాలని తెలిపారు.అర్హులైన జర్నలిస్టులందరికీ సంతృప్తస్థాయిలో ఇళ్ల స్థలం కేటాయించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వాలంటీర్ల వ్యవస్థ ఆదర్శనీయం

## వాలంటీర్ల సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష




కడప ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

గ్రామ, వార్డు సచివాలయ సేవలతో ప్రభుత్వ పరిపాలనలో నూతన వరవడి సృష్టించిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నందు మున్సిపల్ పరిధిలోని వార్డులకు సంబంధించి సచివాలయ వార్డు వాలంటీర్ల సేవా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష హాజరయ్యారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష మాట్లాడుతూ...దేశంలో ఎక్కడా లేని విదంగా గ్రామ ,వార్డు సచివాలయ వ్యవస్థను మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా స్థాపించడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల గడపకు చేరుస్తున్న మానవతా మూర్తులు వాలంటీర్లని కొనియాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ,కుల, మత,పార్టీ లకతీతంగా అవినీతి, వివక్షత లేకుండా అర్హులైన లబ్ధిదారులం దరికీ అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు సైనికుల్లా పనిచేసి మెరుగైన సేవలందించారన్నారు. ప్రతిభ చూపిన వాలంటీర్లను గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవ రత్న, సేవా వజ్ర పేర్లతో సత్కరిస్తోందన్నారు. ప్రభుత్వ భూములలో పాటు,కోట్ల రూపాయల విలువ గల ప్రైవేటు భూములను సైతం కొని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడంలో అర్హులైన 31 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి వాలంటిర్ల మీద పెట్టుకున్న నమ్మకాలను వమ్ము చేయకుండా మరింత కష్టించి పని చేయాలని కోరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా వివరించాలన్నారు. వై యస్ జగన్ మోహన్ రెడ్డి లాంటి రాష్ట్ర ముఖ్యమంత్రి కలకాలం వుంటే రాష్ట్రంలో పేదరికమే ఉండదన్నారు. నగర డిప్యూటీ మేయర్స్ బండి నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం లు మాట్లాడుతూ...గత ప్రభుత్వంలో ఇచ్చిన హామిలను నెరవేర్చలేదన్నారు. . వై.యస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన నాటి నుండి పేద ప్రజల అభ్యున్నతికి నవ రత్నాల రూపంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వాటిని సచివాలయ గ్రామ వార్డు వాలంటీర్ల ద్వారా అందజేయడం జరుగుతుందని అన్నారు. మన సచివాలయ వ్యవస్థ మిగతా రాష్ట్రాలకు ఆదర్శం అన్నారు. ప్రభుత్వం గ్రామ, వార్డ్ సచివాలయాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సేవలందించడంలో ప్రతిభ చూపిన ఆయా వార్డు లకు సంబంధించి 5 మందికి సేవ వజ్ర, 15 మందికి సేవా రత్న 1596 మంది వాలంటీర్లను అభినందిస్తూ సేవా మిత్ర పురస్కారాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిష నర్ రాకేష్ చంద్ర, కార్పొరేటర్లు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా,వైఎస్సార్సీపి నాయకులు ఎస్. బి. అహమ్మద్ బాషా, ఆఫ్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, నాయకుర్రాళ్ళు, గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి టిడిపి టిక్కెట్ రాముడిదే

**కడప బ్యూరో ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



రాయచోటి తెలుగుదేశం పార్టీ టిక్కెట్ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డినే వరించింది. అధికారికంగా ఈయన పేరును ప్రకటించాల్సి ఉంది. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. మొదటి విడతలోనే ఆయన పేరును ప్రకటించనున్నట్లు తెలి సింది. మాజీ ఎమ్మెల్యేలు రమేష్ కుమార్‌రెడ్డి, ద్వారాక నాథ్‌రెడ్డి టిక్కెట్టు కోసం ప్రయత్నించినప్పటికి ఆ పార్టీ అధిష్టానం రాంప్రసాద్‌రెడ్డి వైపే మొగ్గు చూపింది. పలురకాల సర్వేలతో పాటు పార్టీలోకి వచ్చినప్పటి నుంచి ఆయన చేసిన సేవలను గుర్తించి రాముడికి ఖరారు చేశారు. పలువురు పలురకాల కేసులు అక్రమంగా బనాయించినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ ముందుకు వెళ్ళడం ముఖ్యంగా చంద్రబాబు పర్యటన సందర్భంగా పుంగ నూరులో జరిగిన ఘటనలో రాముడు ధైర్యంగా ముందుకు సాగడం, బాబుతో పాటు లోకేష్‌ను కూడా ఆకర్షించింది. అంతేకాక 2004 నుంచి ఆయన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి పేరుతో నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాగిరెడ్డి రాయచోటికి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి సౌమ్యుడిగా మంచిపేరు సంపాదించుకున్నారు. అనంతరం ఈయన సోదరుడు మండిపల్లి నారాయణరెడ్డి కూడా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగారు. 2004లో ఈయన సోదరి శ్రీలత కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి రాజ కీయాల్లో క్రీయాశీలకంగా వ్యవహరించి రాజశేఖర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిన్న వయసు లోనే రాయచోటి ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2012లో జరిగిన శాసనసభ ఉప ఎన్నికల్లో మొదటిసారి రాయచోటి ఎమ్మెల్యేగా రాం ప్రసాద్‌రెడ్డి పోటీ చేశారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాముడు వైసిపి గూటికి చేరారు. చాలాకాలం ఆ పార్టీలో ఉన్నప్పటికీ తగిన గుర్తింపు లేక పోవడంతో పాటు ఎలాంటి పదవులు దక్కలేదు. దీంతో ఆ పార్టీ నుంచి తెలుగుదేశంలో చేరారు. ఈ క్రమంలో రాయ చోటి టిక్కెట్టు ఈయనకు దక్కడం పట్ల ఆయన వర్గీయుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి.

## రహదారుల భద్రతలో

# తల్లిదండ్రులూ సామాజిక బాధ్యత వహించాలి

## 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభలో కలెక్టర్ విజయ్ రామరాజు

**కడప ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ట్రాఫిక్ నిబంధనలతో పాటు.. తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యత వహించాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో జిల్లా రవాణా శాఖ డిటిసి మీరా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన "35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల" ముగింపు సభకు.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి 20 నుండి ఫిబ్రవరి 19 వరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన "జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు"లో భాగంగా ఆ శాఖ అధికారులు నిర్వహించిన పలు అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో ముఖ్యంగా యువతలో మరింత అవగాహన పెరిగి ఉంటుందని విశ్వసించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రభుత్వ సూచనలపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజూ ఉదయం సంతోషంగా ఇంటి నుండి బయటకు వచ్చిన వ్యక్తి.. వారి విధులు ముగించుకుని.. సాయంత్రం తిరిగి అదే సంతోషంతో సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. ఒక కుటుంబంలో సంపాదనపరుడు రహదారి ప్రమాదంలో మరణించినట్లయితే ఆ కుటుంబం పేదరికం నుంచి బయట పడటానికి ఒక తరం కాలం పడుతుందని, ప్రతి ఒక్కరు కూడా రహదారి నియమాలపై కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. రోడ్లపై మనం జాగ్రత్తగా వెళ్లడంతో పాటు.. ఎదుటి వ్యక్తి కూడా జాగ్రత్తగా వెళ్లేలా అవగాహనతో అడుగులు వేయాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగిస్తే జరిగే అనర్థాలు, ప్రమాదాలు, ప్రాణ నష్టం.. తద్వారా కుటుంబంలో వ్యక్తులను కోల్పోతే ఎదురయ్యే పరిస్థితులను తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజేయాలన్నారు. పిల్లల్లో సామాజిక విలువలను నేర్పించినపుడే.. ప్రాణం విలువ తెలియడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రమశిక్షణ అలవడినపుడే రోడ్లపై విచక్షణతో వాహనాలు నడపడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు ఈ అంశాలపై పూర్తిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. రోడ్ ఇంజనీరింగ్ లో లోపాలు లేకుండా చూడవలసిందిగా సంబంధిత ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్స్ ను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు ఎటువంటి ప్రమాదానికి కారణం కాకుండా బస్సులను నడపవలసిందిగా ఆర్టీసీ ఆర్.ఎం.ను ఆదేశించారు. వాహనంపై ఫోన్ మాట్లాడుతూ నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో పాటు రహదారి నిబంధనలను పాటించకపోవడం మొదలైనని.. రోడ్డు ప్రమాదాలు ప్రధాన కారణాలని.. నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. డిటిసి మీరా ప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్ల భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన యజమానులు, వాహన డ్రైవర్లు, ప్రజలు విద్యార్థులకు రహదారి భద్రత, రోడ్ సైన్స్, మోటారు వాహనాల చట్టం 2019, మోటార్ ఇన్సూరెన్స్, గుడ్ సమరీటన్ లాస్, గుడ్ సమ్ రిటన్ అవార్డ్స్, రోడ్ సేఫ్టీ ఆడిట్ మొదలగు విషయాలపై వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాము న్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్లు మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం.. ఎంత ప్రమాదకరమో.. వివరిస్తూ.. గతంలో జరిగిన పలు సంఘటన లను ఉదహరిస్తూ అతి వేగం, ప్రమాదకరం అనే సందేశాన్ని తెలియజేసారు. రహదారుల భద్రత కోసం ప్రజల సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం రహదారి భద్రత కోసం కృషి చేసిన అధికారులకు, సంస్థలకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. రహదారి భద్రతపై రవాణా శాఖ వారు విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముందుగా రవాణా శాఖ రూపొం దించిన 'రోడ్డు భద్రత- ప్రమాదాల నివారణ'పై అవగాహన పెంచే పలు లఘు చిత్రాలు ఆహుతులను ఆలోచింపజేయడంతో పాటు.. వారిలో అవగాహనను పెంపొందించాయి. కార్యక్రమంలో.. ఆర్టీసీ ఈడి (జోన్-4) వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్.ఇ. మహేశ్వర్ రెడ్డి , ఆర్టీవో మురళీధర్, ఎం.వి.ఐ. విజయ్ భాస్కర్, ఏఎంవీఐలు లక్ష్మీ ప్రసన్న, అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రవాణా శాఖ కానిస్టేబుల్స్, హోంగార్డ్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, డ్రైవర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాశి నాయన భక్తుల మనోభావాలు దెబ్బతీయకండి



**కాశినాయన ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

కాశినాయనమండలంలోని కనుక ప్రముఖ పుణ్యక్షేత్రం అయినటువంటి శ్రీ అవదూత కాశినాయన కొలువైన జ్యోతి క్షేత్రంలోని దేవాలయ,తదితర కట్టడాలను అటవి చట్టాలకు వ్యతిరేకమని సంబంధిత అధికారులు డిఎఫ్ఓ,ఆర్డిఓ,సబ్ డిఎఫ్ఓ,ఎఫ్ఆర్ఓ మరియు పోలీస్ సిబ్బందితో వచ్చి దేవస్థాన పరిధిలో ఏ మేరకు ఆక్రమణకు గురైందో విచారించి వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాలను కున్నారు ఈ లోగా కాశినాయన భక్తులు 1000 మంది పైగా భక్తులతో వెల్లి అటవి అధికారులతో చర్చించి మేము అతి తొందరలో పూర్తి స్థాయి అనుమతులు తెచ్చుకుంటామని పై అధికారులను ఒప్పించి దేవాలయ నిర్మాణం సజావుగా సాగేటట్టు బద్వేల్ నియోజకవర్గ వైయస్సార్సీపి అదనపు సమన్వయ కర్త నల్లేరు విశ్వనాధ రెడ్డి అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిని భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకొని ప్రజలలో భక్తులకు ఆందోళన లేకుండా వాస్తవ నివేదికను పై అధికారులకు పంపుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.అదే విధంగా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి వారి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వారితో సంప్రదింపులు జరుపుతామని తెలిపారు. మండల భక్తులు ఆరాధ్య దైవమైన కాశినాయన స్వామి జ్యోతి క్షేత్రంలో ఏ చిన్న పొరపాటు జెరిగిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందని మరోసారి కాశినాయన భక్తుల విజ్ఞప్తిని వారు కూడా న్యాయం చేస్తారని భక్తులు కోరుకుంటున్నారు. బద్వేల్ టిడిపి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మరియు యువనాయకుడు రితీష్ రెడ్డి జ్యోతి క్షేత్రంలో ఫారెస్ట్ అధికారులతో శ్రీ కాశినాయన ఆ ఆలయం విషిష్టత గురించి అధికారులకు తెలియపరిచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కాశినాయన భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# పనులు చేయకనే...బిల్లులు కాజేసేందుకు యత్నం..!

**రాజంపేట,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:**

సార్వత్రిక ఎన్నికల సమయం తొందరలో ముగియనుంది.దీనికి తోడు నెల రోజుల్లో పే ఎన్నికల కోడ్ కూడా పెట్టే అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి. ఇదే అదునుగా నియోజకవర్గాల్లోని నాయకులు, మండలంలోని నాయకులు మండలాల్లో ఉన్న నిధులకు పనులు చేయకనే వాటిని మింగేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. రైల్వేకోడూరు,రాజంపేట నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో దాదాపుగా ఇటీవల ఎన్నికల బదిలీపై వెళ్లిన అధికారులు ఉన్న సమయాల్లోనే బిల్లులు కాజేసినట్లు తెలుస్తుంది.అయితే ఓబులవారిపల్లి మండలంలో మండల గ్రాంటు రెండున్నర కోట్లకు పైగా ఉన్నట్లు తెలుస్తుంది.దీనికి ఇంతవరకు ఎక్కడ పనులు చేపట్టలేదు.అయితే బదిలీ అయిన ఎంపీడీవోలు ఉన్నంతకాలం ఆయనతో మండల నిధులను మింగేందుకు కొంతమంది నాయకులు ప్రయత్నించడం జరిగింది.ఆ అధికారి రేపు మాపు అంటూ నాయకుల చెవుల్లో తాళుదురిసి బదిలీపై వెళ్లారు.కొత్త ఎంపీడీవో రావడంతో మీరు ఎలాగైనా ఎన్నికల కోడ్ పెట్టకముందే మండలంలో ఉన్న సుమారు రెండున్నర కోటి నిధులను స్వాహా చేసేందుకు స్థానిక నాయకులు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి పనులు కాజేసేందుకు అనేక రకాల ఒత్తిడిలను అధికారులపై ఉపయోగిస్తున్నట్లు కూడా తెలుస్తుంది.ఇటీవల ఇంజనీరింగ్ శాఖ చెందిన ఓ అధికారి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పటికీ అతనిని వదలకుండా అక్కడికే వెళ్లి ఎం.బుక్కులు రికార్డు కూడా చేయించుకున్నట్లు తెలుస్తుంది.దీని ఆధారంతో గత మూడు నాలుగు రోజుల నుంచి ఓబులవారిపల్లి ఎంపీడీవోను ఫింగర్ పెట్టమని స్థానిక నాయకులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు కూడా తెలుస్తుంది.ఎన్నికల కోసం వచ్చిన ఆ అధికారి ఈ నాయకులు ఒత్తిడికి దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది. చివరకు పంచాయతీల్లో అభివృద్ధి పనుల పట్ల ఆరీ తీసినట్లు తెలిసింది.అయితే ఎక్కడ కూడా 10 రూపాయలు పని చేసిన దాఖలాలు లేవని రెండు కోట్లకు పైగా బిల్లులు చెల్లించేందుకు,ఫింగర్ గాని,సంతకం కానీ.పెట్టే ప్రసక్తే లేదని కాళ్లకు బంధాలు వేసుకొని కూర్చున్నట్లు తెలుస్తుంది.దీంతో చేసేదేమీ లేక ఆ నాయకులు ఇప్పుడిప్పుడే అక్కడక్కడ ఆరీ కొరాపనులు చేపట్టి రెండున్నర కోట్లు బిల్లును స్వాహా చేసేందుకు కూడా యత్నిస్తున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో దాదాపు ముందే అప్పుడున్న అధికారులతో నాయకులు పనులు చేసినట్లు రికార్డు చేసుకొని బిల్లులు పొందినట్టు తెలుస్తుంది.కొన్ని మండలాల్లో అధికారులు పనులు లేకుండా బిల్లులు చేసేందుకు ససేమిరా అని తిష్ట వేచి కూర్చున్నట్టు తెలుస్తుంది.దీంతో అలాంటి మండలాలు నిధులు ఖర్చు చేయడం వలన అభివృద్ధి పనుల్లో వెనుకబడ్డారన్న జాబితాలో కూడా ఉన్నట్లు తెలుస్తుంది.అయితే నిజాయతీగా అధికారులు పనులు చేసిన మండలాలు నిధులు ఖర్చు చేయడంలో వెనుకంజలోనే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ రెండు నియోజకవర్గాల్లో నాయకులకు



పాత రోడ్డుకు కొత్త బిల్లు

అధికారులు తొత్తులాగా మారి కమిషన్ల కోసం కక్కుర్తి పడి పనులు లేకుండానే పాత పనులు చేపి రికార్డులు చేసి కోట్లకు కోట్ల నిధులను మింగేయటమే కాకుండా తమ మండలాలు నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పథంలో ముందున్నట్లు కూడా భుజాల ఎగరేసుకుంటున్నట్లు తెలుస్తుంది.అయితే ఈ పనులు పట్ల ఆడిట్ జరిగితే తప్పనిసరిగా అవినీతి బయటపడే పరిస్థితులు మెండుగా కనబడుతున్నట్లు తెలుస్తుంది. ఓబులవారిపల్లి మండలంలో ఇప్పటికే అధికంగా పనులు చేయకనే అక్రమంగా తప్పుడు రికార్డు సృష్టించి కోట్లాది రూపాయల బిల్లులు మింగేసినట్లు తెలుస్తుంది. వీటి పట్ల ఇటీవల మండల స్థాయి నాయకులకు పంచాయతీ సర్పంచ్‌ల మధ్య కూడా విభేదాలు పొడచూపి తీవ్ర స్థాయికి చేరి అధినాయకుల వద్ద పంచాయతీలు కూడా చేసినట్లు తెలుస్తుంది.ఈ మండలంలో ఇంజినీరింగ్ శాఖ అధికారులు,మండల శాఖ అధికారులు వీరు బిల్లు ఇవ్వడంలోనూ,వారు పనులు చేయించడంలోనూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగానే చేసినట్టు తెలుస్తుంది. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం మండలంలో ఉన్న రెండున్నర కోటి నిధులను కాజేసేందుకు అధికారులపై నాయకులు చేస్తున్న ఒత్తిడి అంతా కాదని తెలుస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఇలాంటి అవినీతి పనులకు పాల్పడిన అధికారులు ఉద్యోగుల పోగొట్టుకొని,ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. దీంతో అధికారులు భయపడుతుంటే నాయకులు వారి భుజాలు తట్టి అవినీతి పనులు చేసి ఉన్న నిధులు తమ జేబుల్లో వేయమని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ విషయమై ఓబులవారిపల్లె ఎంపీడీవోను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోను ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

# రాజంపేట వైసిపిలో అసైన్‌మెంట్ ముసలం!

## సీఎం ఆదేశాలు సైతం బేఖాతరు?!

## రెండు వర్గాలుగా విడిపోయిన వైసిపి నేతలు

**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



రాజంపేట నియోజకవర్గంలో అసైన్‌మెంట్ భూముల వ్యవహారం ఆ పార్టీలో ముసలం రేపింది. రెండో విడత అసైన్‌మెర్ కమిటీ సమావేశం జరపకపోవడంపై నియోజకవర్గంలో 40 మంది సర్పంచులు, ఉప సర్పంచులు, 12 మంది ఎంపిటిసిలు అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు నిరసన గళం విప్పారు. సాక్షాత్తు సీఎం ఆదేశిస్తే కూడా అసైన్‌మెంట్‌లో తమకు భూములు ఇచ్చేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పక్షంలో ఉండి కూడా ఆందోళన చేయాల్సి వస్తోందని విచారణ వ్యక్తం చేశారు. సోమవారం ఆరు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు అన్నమయ్య విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఆర్‌డిఓ కార్యాలయ ఏఓ సత్యానందంను కలిశారు. అనంతరం మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీలో అర్హులకు కూడా న్యాయం చేయరా అంటూ ప్రశ్నించారు. గతంలో అధికారుల మాటలు నమ్మి కోర్టులో కూడా పిటిషన్లు ఉపసంహరించిన తమకు న్యాయం చేయకపోతే ఎవరు చేస్తారని ప్రశ్నించారు. రాజంపేట ఆర్‌డిఓ కార్యాలయానికి రాష్ట్ర ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య, మరో డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి నందలూరు, సుండుపల్లి, సిద్ధవటం మండలాల మండల కమిటీ అధ్యక్షులు నాగేంద్ర, రామ స్వామిరెడ్డి, నీలకంఠారెడ్డి, ముఖ్య నాయకులు, ఆర్ఎంరెడ్డి, రాజంపేట మండల జెసిఎస్ కన్వీనర్ గంగిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పోలి మురళి, 60మంది ముఖ్యనేతలు ఆందోళనలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోకపోవడం ఎంత దారుణమని అన్నారు. నందలూరు తహశీల్దారు అర్హులైన వారికి భూములు కేటాయించాలనీ, అనుభవంలో ఉన్న రైతులు కోర్టును ఆశ్రయించారనీ, కోర్టులో పిటిషన్ ఉపసంహరిస్తే అసైన్‌మెంట్ కమిటీలో స్థానం కల్పిస్తామని చెప్పి పిటిషన్ ఉపసంహరించాక మొండి చేయి చూపారని అన్నం నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో రెండో విడత అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి అర్హులకు భూములు కేటాయించారనీ, రాజంపేటలో ఎందుకు నిర్వహించ లేదని ఆర్.ఎం.రెడ్డి ప్రశ్నించారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

విధ్వంసమో, స్వర్ణ యుగమో ప్రజలే తేలుస్తారు
టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు
2లో

పుష్పయాగంతో ముగిసిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు
4లో

## సూరపురాజుపల్లెకు విద్యుత్‌దీపాలంకరణ

రైల్వేకోడూరు రూరల్ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని సూరపురాజు పల్లెకు గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో విద్యుత్తు ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎపిపి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో బల్బులను గ్రామంతా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు విద్యుత్ దీపాల అలంకరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## అన్నమాచార్య విద్యా సంస్థలు స్విడ్జర్లాండ్ కంపెనీతో ఎంఓయు

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల స్విడ్జర్లాండ్‌లోని ప్రతిష్టాత్మక ఐఇఎస్, బి. ప్రొక్టర్ వై.కంపెనీతో అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చు కునేం దుకు సోమవారం ఎఓయును కుదురు కున్నారు. పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమల స్థాపనలో వాణిజ్యం చేసేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందని తెలిపారు. అన్నమాచార్య విద్యా సంస్థల తరపున డాక్టర కృష్ణంరాజు, హైదరాబాదులోని విదేశీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంఓయు ద్వారా ఆధునాతన విద్యా సాంకేతిక పరిజ్ఞానాన్ని పేటెంట్ ద్వారా పొందవచ్చన్నారు. ప్రధానంగా నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేగం కాదు ముఖ్యం కాదు... విలువైనది జీవితం

రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



విద్యార్థులు వేగం ప్యాషన్ అనుకుంటే సరికాదనీ, జీవితం ఎంతో విలువైనదని రాజంపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు పోటీ పడి వాహనాలు నడపడం మానుకోవాలని చెప్పారు. విద్యార్థు లు సమాజంలో చైతన్యం తీసుకుని రావాలనీ, అలాంటి వారు నిబంధనలకు విరుద్ధంగా రోడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే నష్ట పోవాల్సి వస్తుందని చెప్పారు. హెల్మెంట్ లేని ప్రయాణం, మద్యం సేవించి ప్రయాణాలు చేయకూడదని అన్నారు. సమావేశంలో పార్మాసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత అధ్యాపకులు ప్రదీప్ కుమార్, సరోవర్ పాల్గొన్నారు.

## తండ్రి ఆశయాలను నెరవేర్చడం ప్రశంసనీయం

### - డిప్యూటీ సీఎం, మేయర్

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



కడప నగరంలోని డిప్యూటీ సీఎం, మేయర్ కార్యాలయంలో ప్రముఖ సీనియర్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ కమ్ జర్నలిస్టు రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకం డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు చేతుల మీదుగా రాయల్ రషీద్ తనయుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్‌లు మాట్లాడుతూ తండ్రి ఆశయాలను నెరవేర్చాలని కోరుతూ తన తండ్రిపై ఉన్న ప్రేమాభి మానాలతో రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకం రూపొందించి ఆవిష్కరించడం ప్రశంసనీయమన్నారు. తల్లిదండ్రుల కోసం ఇటువంటి గొప్ప పనులు చేసి వారిని ఆనందపరిచి తల్లి దండ్రుల ఆశీస్సులు అందుకోవాలన్నారు. రాయల్ రషీద్ తనయుడు షబ్బీర్ మాట్లాడుతూ దాదాపు 60 సంవత్సరాల నుంచి తన తండ్రి రాయల్ రషీద్ జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు సేవలందించారని, తన తండ్రి జీవిత చరిత్ర పుస్తకం రూపొందించాలనుకున్నారు. కానీ ఆకస్మికంగా స్వర్గస్తులైనారు. తన తండ్రి ఆశయాలను నెనవేర్చాలని కోరుతూ రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని తయారు చేసి తన నాన్నకు అంకితం చేస్తున్నామని తెలిపారు.

## జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ జర్నలిస్టు ర్యాలీ

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రభుత్వ ఆస్తులు కాపాడుతూ అవినీతి ఆగడాలను పత్రికా రంగంలో తనదైన శైలిలో పాత్రికేయులు అవినీతిని వెలకితీస్తు న్న వారిపై దాడి చేయడం దుర్మార్గమని ఉమ్మడి జిల్లా నాయకులు చౌడవరం సుబ్బనరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మ చెంగయ్య, దాసరి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడులో సీఎం సభలో కవర్ చేసే విలేకరిపై కొందరు అధికార పార్టీ నాయకులు పాత్రికేయులపై దాడి చేయడం, సెల్ ఫోన్లు లాక్కోవడం, దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. సోమ వారం రైల్వేకోడూరు పట్టణంలో పాత్రికేయుల బృందం నిరసన కార్యక్రమాలు చేపట్టి వారికి మద్దతు పలికారు. పోలీసు స్టేషన్‌లో పాత్రికేయుల రక్షణ కల్పించాలని దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విలేకరులు వినతిపత్రం పోలీసులకు అందించారు.

## వైకాపా ప్రభుత్వం పతనం ఖాయం

కమలాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



ఈ రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్న వైసీపీ నాయకులు సిద్ధం సభకు మూడు వేల బస్సులను తరలించారు. దాని వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిద్ధం సభలో జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 98 శాతం హామీలు నెరవేర్చినట్లు చెప్పడం దుర్మార్గమని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వ పతనం ఖాయమన్నారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి రిపోర్టుపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సమాజంలో నాలుగో స్తంభంగా పిలువబడే పత్రికా రంగంపై దాడి చేసిన ప్రభుత్వాలు పూర్తిగా కనుమరుగయ్యాయని ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూడా అదే కోవలోకి పోతోందని మండిపడ్డారు. రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనకబడిపోయిందన్నారు. టీడీపీ ప్రభఉత్వం హయాంలో కమలాపురంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తే అది 80శాతం పూర్తయిందని 20శాతం పనులు నిధులు ఇవ్వని జగన్ రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్రా ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా సాధిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి. పరిశ్రమలు వస్తాయని నిరుద్యోగ సమస్య తీరుతుందని ఓట్లు వేయించుకున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులు చేస్తారు. కానీ జగన్ మాత్రం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే కూల్చే పనులు చేపట్టారని విమర్శించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే అందులో నష్టపోయిన నిర్వాసితులకు సహాయం చేయలేని దీనస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే వాటిని కూడా రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక పరిపాలన ప్రజలు గమనిస్తు న్నారని త్వరలో నీకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్ బాషా, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాఘవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రెడ్డి, కరీం పాల్గొన్నారు.

## విధ్వంసమో, స్వర్ణయుగమో ప్రజలే తేలుస్తారు

### టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌రాజు



రాజంపేట అర్బన్ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమ పథకా లతో స్వర్ణయుగం తెచ్చామని యుద్ధం సభలో చెప్పిన ముఖ్య మంత్రికి జగన్‌కు ప్రజలు ఇచ్చే ఎన్నికల్లో ఎలాంటి పాలన ఇచ్చారో జనలే తేలుస్తారని అన్నారు. సోమ వారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడు సభకు బస్సులు వేసి ప్రజలను వేలాదిగా తరలించి ఇబ్బందులు పాలు చేశారన్నారు. బల ప్రదర్శనతో జనాలు సమీకరించడం సరికాదన్నారు. మంచి పరిపాలన అందిస్తే ప్రజలే స్వచ్ఛందంగా వస్తారని చెప్పారు. బిసిలకు 27 సంక్షేమ పథకాలు తొలగించారని గుర్తు చేశారు. జగన్ అంటే విధ్వంస, రౌడీయిజం, కోడికత్తి, అక్రమ మైనింగ్, ఇసుక దోపిడీ అని ప్రజలు పేర్కొంటున్నా రని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. ఏడుసార్లు బటన్‌నొక్కి కరెంటు బిల్లులు పెంచారని ప్రశ్నించారు. మైనార్టీలకు ఎన్నో పథకాలు రద్దు చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్లు నిర్వీర్యం చేసి మోసం చేశారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనీ, వచ్చే ఎన్నికల్లో గద్దె దిగేందుకు జగన్ సిద్ధం కావాలని అన్నారు. టిడిపి సీనియర్ నేతలు సుబ్రమణ్యంనాయుడు, చలమయ్య యాదవ్, తెలుగుయువత నేతలు పరశురాం, సతీష్‌రాజు, ఒంటిమిట్ట మాజీ ఎంపిపి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## పోలీసులే కబ్జాకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలి?

### బాధితుల ఆవేదన

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



మా తండ్రి కొనుగోలు చేసిన స్థలం 40 ఏళ్లగా మా ఆధీనంలో ఉంటున్న భూమిని పోలీసులు కబ్జా చేస్తుంటే మేము ఎవరికి చెప్పాలని తాళ్లపల్లె ఉదయ భాస్కర్‌రెడ్డి వాపోయారు. సోమవారం కడపలో ఆయన మీడియాతో మాట్లా డుతూ తొండూరు గ్రామానికి చెందిన మా నాన్న తాళ్లపల్లి గంగిరెడ్డి పులివెందుల లోని మున్సిపల్ కార్యాలయం వెనక 1981లో 3.22 ఎకరాలు కొనుగోలు చేశారన్నారు. అందులో 2.40 ఎకరాలు అమ్మారన్నారు. మిగిలిన 82 సెంట్లు భూమిలో 40 ఏళ్లగా మా అనుభవంలో ఉందన్నారు. ఇటీవల పోలీసు రామాం జనేయులురెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాధవిరెడ్డి, అలీబాబా టీచర్, ఉగాది నాయక్ అనే వ్యక్తులు నా భూమిలో దౌర్జన్యంగా కంచె నాటారన్నారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఆ స్థలంపై కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకోవడం జరిగిందన్నారు. అయినా ఆ స్థలంలో వారితో పాటు మరికొంత మందితో దౌర్జన్యంగా ఇల్లు నిర్మిస్తున్నారని అడిగితే నాపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పోలీసులే అలా చేస్తుంటే నేను ఎవరికి చెప్పుకోవాలని వాపోయారు. కలెక్టరు, ఎస్పీలను కలిసి స్పందనలో వివరించామనీ, తనకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నాడు.

## 31వ డివిజన్‌లో బాబూ స్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



నగరంలోని 31వ డివిజన్‌లో 2వ గాంధీ బొమ్మ రజా ఖాన్ బాఘ్ మసీదు నుంచి బాబూ స్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాసులు పాల్గొని ప్రజలకు తెదేపా పథకాల గురించి వివరించారు. 31వ డివిజన్ కార్యాలయం ప్రారంభించారు. కార్యక్రమంలో నయాబ్, శివకొండారెడ్డి, ఇస్మాయిల్, జిలానీ బాషా, గౌస్, జియా, జమీల్, భాస్కర్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

## నేడు వాలంటీర్లకు సత్కారం

దువ్వూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల్లో వాలంటీర్లుగా పనిచేస్తున్న 259 మందికి ఎంపీడీవో కార్యాలయంలో సత్కార కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. మండలంలో 259 మంది వాలంటీర్లు పనిచేస్తుండగా వారిలో 252 మందికి సేవా మిత్ర అవార్డు తీసుకుంటున్నారని ఒక్కొరికి రూ.15 వేలు అందజేస్తారన్నారు. 5 మందికి సేవా రత్న రూ.30వేలు చొప్పున ఇద్దరికి సేవా వజ్ర రూ.45 వేలు చెక్కులు అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరవుతారనీ, సర్పంచులు, ఎంపీ టీసీలు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

## విలేకరిపై దాడి హేయమైన చర్య

### ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దారు, ఎస్పైకి వినతిపత్రం

కమలాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సమావేశంలో ఫొటోలు తీస్తుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి వైకాపా అల్లరి మూకలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ కృష్ణకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన కార్య క్రమాల్లో భాగంగా కమలాపురంలో తహసీల్దారుకు ఎస్పైకి కమలలాపురం విలే కరులు వినతిపత్రం అందించారు. జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పాల్గొన్నారు.

## రాచమల్లుకు టికెట్ ఇస్తే పునరాలోచిస్తాం

### వైసిపి అసమ్మతి నేత, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



ప్రొద్దుటూరులో వైసిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి కేటాయిస్తే తామంతా కలిసి పునరాలోచిస్తామని వైసిపి అసమ్మతి నేత సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీనివాస్‌నగర్‌లో అసమ్మతి నేతలతో కలిసి ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము వైయస్సార్ జెండాకు, రాజశేఖర్ రెడ్డి కుటుం బానికి, జగనన్నకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. ప్రొద్దు టూరు నియోజికవర్గంలో రాచమల్లుకు తప్ప మరి ఇంకెవరికైన టికెట్ ఇస్తే 40వేల ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ రాచమల్లుకే టికెట్ ఇస్తే ఆ సంధర్భంలో తామంతా కలిసి పుపరాలోచన చేస్తామని ఆయన అన్నారు. ఒక వేళ తమకే టికెట్ ఇస్తే అందరం కలిసి ప్రొద్దుటూరు నియోజికవర్గంలో వైసిపి జెండాను ఎగురవేస్తామని వివరించారు. ఈ ప్రచారంలో 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష, 19వ వార్డు కౌన్సిలర్ మునీర్, 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విలేకరి దాడి ఘటనపై తహసీల్దార్‌కు వినతిపత్రం

ముద్దనూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో వైయస్సార్ సిపి నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఎలక్ట్రానిక్ మీడియా ఫోటోగ్రాఫర్‌పై వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని ముద్దనూరు మండల పత్రాకా విలేకరులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో తహసీల్దార్ సువర్ణాదేవికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలోనే పాత్రికేయులపై దౌర్జన్యాలు చేయడం దారుణం అని, గతంలో సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎక్కడైన విలేకరులపై, మీడియా ప్రతినిధులపై దాడులు చేస్తే అలాంటి వారికి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక ఎన్నికలలో సోషల్ మీడియా కీలకం

### టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి

ముద్దనూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



స్థానిక ముద్దనూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి సమక్షంలో సోషల్ మీడియా అవగాహణ కార్యక్రమం నిర్వ హించారు. అధికార పక్షం ఎటువంటి అభివృద్ధి చేయక పోయిన సోషల్ మీడియాలో చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ దుర్మార్గపు పాలనను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టి ప్రజలను చైతన్య పరచాలని టిడిపి కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, కడప పార్లమెంట్ ఐ టిడిపి అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు శివరామిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు జగదీష్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



పట్టణంలో విశ్వకర్మ దరఖాస్తుల సంఖ్యకు తగినంతగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిజెపి ప్రొద్దుటూరు అసెంబ్లీ ఇంచార్జ్ గొర్రె శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో విశ్వకర్మ పథకం కింద వచ్చిన 2101 ధరఖాస్తులను కలెక్టర్ సూచనల మేరకు సోమవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. దరఖాస్తుల సంఖ్యకు అనుగుణంగా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం కల్పించి ఇచ్చే అన్ని వసతు లను కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ ధరఖాస్తులను పరిశీలించి అన్ని సచివాలయాలకు అందజేస్తామని ఆ తర్వాత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, పట్టన అధ్యక్షులు సంజీవ్‌కుమార్, మాజీ అధ్యక్షులు కంబగిరి ఓబులేసు, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కుమారి, సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ నరేష్, ఉలసాల రామచంద్రుడు, రాజుపాళెం సురేష్ పాల్గొన్నారు.

## నాపై ఒక్క అవినీతినైన నిరూపిస్తావా రాచమల్లు

### మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



నాపై ఒక్క అవినీతి ఆరోపణ అయినా నిరూపిస్తావా రాచమల్లు అని, తాను కేవలం ప్రజలనే నమ్ముకున్నానని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను కేవలం ప్రజలనే నమ్ముకున్నానని, తనను 5సార్లు గెలిపించిందిం, ఆ తర్వాత ఓడించింది ప్రజలే అని స్పష్టం చేశారు. ఎవరి గెలుపోటములైన ప్రజలే నిర్ణయిస్తారని, వారే ఓట్లేసేదని, ఏ పార్టీకి ఓటు వేసి ఏ అబ్యర్థిని గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసునని వివరించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి దేవదాయ శాఖ భూమిలో రోడ్డు వేస్తే అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో రోడ్డు వేసి భూమిని స్వాహా చేసే ప్రయత్నం ఎమ్మెల్యే రాచమల్లు చేస్తున్నాడంటూ ఆరోపణలు గుప్పించారు. ఎమ్మెల్యే రాచమల్లు సోదరుడు మైలవరం కాలువ భూమిని ఆక్రమించాడని, చౌటపల్లెలోని క్రిష్టియలన్ల భూమిని దొంగ డాక్యుమెంట్లతో ఆక్రమించాలని చూశారని విమర్శించారు. ప్రొద్దుటూరులో నిర్మాణంలో ఉన్న ఆపార్ట్‌మెంట్‌లపై పిటిషన్లు వేసి వారి దగ్గర ఎమ్మెల్యే రాచమల్లు లంచాలు డిమాండ్ చేయలేదా అంటూ ప్రశ్నించారు. 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఏనాడు అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని, ఎమ్మెల్యే రాచమల్లు తనపై ఆరోపణలు చేయడం తగదని, అవినీతి అక్రమాలను తాను పాల్పడినట్లు నిరూపించాలని డిమాండ్ చేశారు. తన అల్లుడు చెన్నకేశవ మాన్యం కాజేసే యత్నం చేస్తే తాను ధర్నా చేసే వరకు ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. ఈ విశయాన్ని ఎమ్మెల్యే నిరూపించాలన్నారు. తాను అక్రమార్జన చేయనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు, చౌడం వెంకటకొండయ్య, ఎర్రన్న, మాజీ టిడిపి పట్టణాధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ శివాలయం పాలకమండలి చైర్మెన్ ఎశంకర్‌నారాయణ పాల్గొన్నారు.

## శివోహం ఆధ్వర్యంలో అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



పట్టణ నడిబొడ్డున వెలసిన అగస్త్రేశ్వరాలయ ప్రాంగణంలో ప్రతి సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం సోమవారం శివోహం చైర్మెన్ శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, కవిత కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సోమవారం దాదాపు 500 మంది ప్రజలు అన్నప్రసాదం స్వీకరించారు. ప్రతివారం తమ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ఆనందం వ్యక్తం చేయడం తమకు సంతృప్తి ఇస్తోందని శివోహం చైర్మెన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, విష్ణు నారాయణ, లింగారెడ్డి పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్తు

### సీఎం సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ మూడో రోజు ప్రచారంలో భాగంగా సోమవారం 11వ వార్డు. 24వ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం సురేష్ నాయుడు ప్రజలతో మాట్లా డుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వివిస్ ముక్తియార్, ఈవి సుధాకర్ రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్, ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీకి నివాళులర్పించిన మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



ఛత్రపతి శివాజి మహారాజ్ 349వ జయంతి సందర్భంగా సోమ వారం మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మెన్ మోరె లక్ష్మణ రావు మనోజి రావు వీధిలో ఛత్రపతి శివాజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మెన్ మోరె లక్ష్మణరావు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షకుడు, హిందూ సామ్రాట్, గెరిల్లా యోధుడు, సర్వమానవాళికి దిక్సూచి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఛప్రతటి శివాజి మరాఠ సేవా సంఘం నాయకులు వై.నరేష్‌కుమార్, వై.సుధాకర్, నరసింహులు మహిళా సభ్యులు వై.సరస్వతి భాయ్, సుజాత భాయ్, సుబహాన్, సభ్యులు వెంకటరమణ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

### సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్

మైదుకూరు పిబ్రవరి 19, ప్రభాత వార్త



మైదుకూరు మునిసిపాలిటి పరిదిలో పేదలు నివాసం ఉంటన్న సుందరయ్య కాలనీకి మౌళిక సదూపాయాలు కల్పించాలని మైదుకూరు మునిసి పల్ కార్యాలయం ముందు సిపియం ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు హాజరైన సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మాట్లాడుతూ సుందరయ్య నగర్ నందు దాదాపు ఏడు సంవత్సరాలుగా 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని కాలనీకి ఇప్పటి వరకు మౌళిక సదుపాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శిం చారు. కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. కాలనీకి సిమెంటు రోడ్లు, ఇండ్లకు విధ్యుత్ మీటర్లు,డోరు నెంబర్లు ఎర్పాటు చేయాలని డికేటి పట్టాలు,ప్రభుత్వ పక్కా భవనాలు, అంగన్వాడి సెంటర్లు మంజూరు చేయాలని డిమాండు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపియం మండల కమీటి సభ్యులు గురవయ్య, బిబినాయకులు రవి,పోలయ్య, ఇమాం, సుధాకర్ పాల్గొన్నారు.

## కొండారెడ్డిని పరామర్శించిన పుట్టా సుధాకర్

మైదుకూరు రూరల్,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:



మైదుకూరు మండలంలోని శివపురం గ్రామ పంచాయతి సర్పంచ్ భాస్కర్ రెడ్డి మోకాళ్ళ సమస్యతో ట్రీట్మెంట్ తీసుకొని ఇంటి వద్ద వున్న భాస్కర్ రెడ్డిని మైదుకూరు మాజీ టిటిడి చైర్మన్,నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్,పుట్టా సుధాకర్ యాదవ్ వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మండలం టిడిపి అధ్యక్షులు భీమయ్యఅన్నవరం సుధాకర్ రెడ్డి, మేకలబాబు, మిల్లు శీను,నాగమోహన్,లక్ష్మీ నారాయణ రెడ్డి, అక్బర్, గుత్తి నారాయణ, పోలురెడ్డి ఉన్నారు.

## వైభవంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

రాజుపాళెం,ఫిబ్రవరి19,ప్రభాతవార్త



మండల పరిదిలోని పర్లపాడు గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మిం చిన ఆలయం, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట వేదపండితుల మంత్రోక్షరణతో, ఆగమ శాస్త్రనుసారం గ్రామపెద్దలు, కమిటి సభ్యులు ఆద్వర్యంలో గ్రామస్తుల సమ క్షంలో వైభవంగా నిర్వహించారు.గ్రామంలో పురాతన పెద్దమ్మతల్లి విగ్రహం ఉన్న ప్రదేశంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మఆలయం ప్రతిష్ట మూడు రోజులుగా ఆలయ,విగ్రహం ప్రతిష్ట కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో, భజనలు, కీర్తనలు, కొలాటాలతో గ్రామంలో గొప్పపండుగ వాతావరణం నెలకొన్నది. గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి,మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి, టిడిపి ఇంచార్జ్ జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ,మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, పోరరెడ్డి నరశింహ్మారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు తోట మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చేర్మేన్ బండి భాస్కర్‌రెడ్డి, మధుసూ ధన్‌రెడ్డి, జగదీశ్వర రెడ్డి పాల్గొని పెద్దమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

## అభివృద్ధికి మరో పేరు వాలెంటరీ వ్యవస్థ

### ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

గోపవరం,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త;



అభివృద్ధికి మరోపేరు వాలెంటరీ వ్యవస్థ అని ఎమ్మెల్యే డా,సుదా ఎమెల్సీ డిసి గోవిందరెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు.స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమ వారం వాలెంటర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకం విజయవంతం అయిందంటే అది వాలెంటర్ల ఘనతే నన్నారు. ఐదు మంది వాలెంటర్లకు సేవా రత్న పథకాలను అంద చేసారు. ఎంపిడిఓ సుబ్రమణ్యం,మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మర్రిపాటి నాగరాజ అద్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచులు రాధా కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి, నరేంద్ర, కార్యదర్శులు శ్రీనివాసుల్‌రెడ్డి, మోసా, విజయ్‌కుమార్, నిఖిత, వెంకటసుబ్బయ్య, మండల వైసిపి ప్రధాన నాయకులు మల్లి కార్జునరెడ్డి, పుల్లయ్య, సరస్వతమ్మ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలే ప్రధాన లక్ష్యం: ఎస్ఐ

గోపవరం,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త;



మండలంలోని అన్ని గ్రామాలలో ఎప్పటి కప్పుడు శాంతి భద్రతలను పరిరక్షించడమే ప్రదాన లక్ష్యం అని ఎస్ఐ రవికుమార్ అనారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ భాధ్యతా యుతంగా ప్రవర్దించాలన్నారు. ఎవరైనా నిభంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక విషయా లకు దూరంగా ఉండాలని గ్రామీణ లను కోరారు. మందు బాబులు హద్దు మీరితే ఇబ్బందులు తప్పవన్నారు. వాహన దారులు నిబందనలను పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా సహకరించాలన్నారు.

**పాసుపోర్టు పోయినది**

పఠాన్ మురాషావల్లి, తండ్రి పి. రషీద్‌ఖాన్, డోర్.నెం. 7/88, నాయక్ స్ట్రీట్, వాయల్పాడు (మం), అన్నమయ్య జిల్లా, ఏపీ. వాయల్పాడు నుండి బైకులో ప్రయాణిస్తుండగా నా పాస్‌పోర్టు పోయినది. W9367140 దొరికిన వారు పై అడ్రస్‌కు తెలుపగలరు.

**పాసుపోర్టు పోయినది**

కమిటీ వెంకటరమణ, తండ్రి కె. బోగాదన్న, డోర్.నెం. 6/80, అనిమెల (గ్రా), వీరపునాయునిపల్లె (మం), వైఎస్ఆర్ కడప జిల్లా. ఏపీ. వీరపునాయునిపల్లె బస్టాండు నుండి కడపకు వెళ్లేందుకు బస్సుకోసం వేచి ఉండగా బ్యాగు పోయినది. అందులో నా పాస్‌పోర్టు పోయినది. నెం. A5290924 దొరికిన వారు పై అడ్రస్‌కు తెలుపగలరు.

## పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

– డీవైఈవో పురుషోత్తం రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని మదనపల్లె డివిజన్ డీవైఈవో పురుషోత్తం రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమారం చదివేవాండ్లపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం కావాలి, ఎలా చదవాలి అన్న అంశాలపై పలు సూచనలు చేశారు. బుక్‌వర్క్, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు సంపత్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు వరప్రసాద్‌రెడ్డి, ముబారక్, సహదేవయ్య, ఉషా, సహదేవయ్య, రామాంజమ్మ, సరస్వతి, రఘు, మంగమ్మ పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలు తలెత్తకుండా అధికారుల ప్రత్యేక దృష్టి

కలికిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



కలికిరి మండలంలోని 14 పంచాయతీల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివమోహన్‌లు తెలిపారు. సోమవారం మండలంలోని గుట్టపాలెం పంచాయతీలోని గుట్టపాలెం కస్పా, దిగువ కమ్మవారిపల్లె గ్రామాలను ఎంపీడీవో రామకృష్ణ, డీఈ శివమోహన్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులను మంచినీటి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం వస్తుండడంతో మంచినీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ గ్రామస్థులకు సూచించారు. అదే విధంగా కలికిరి–సోమల రోడ్డు మార్గంలో పైపులైను మరమ్మతులకు గురై మంచినీరు వృథా అవుతున్నట్లు గ్రామస్థులు ఎంపీడీవో రామకృష్ణ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీడీవో టెలిఫోన్ ఎక్చేంజ్ అధికారులు మరమ్మతులు చేసేటప్పుడు పైపులైను మరమ్మతులకు గురైనట్లు గుర్తించి వెంటనే పైపులైను మరమ్మతులు చేయించాలని టెలిఫోన్ ఎక్చేంజ్ అధికారులకు సూచించారు. టెలిఫోన్ ఎక్చేంజ్ అధికారులు మరమ్మతులు చేయిస్తామని ఎంపీడీవోకు తెలిపారు. ఈ విధంగా రాబోవు వేసవిలో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకూడదని ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాలు సందర్శిస్తున్నట్లు ఎంపీడీవో రామృష్ణ, డీఈ శివమోహన్‌లు తెలిపారు. కార్యక్రమంలో గుట్టపాలెం సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, కలికిరి మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి గోపీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయండి

– ఏపీడీ మధుబాబు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో మారుమూల గ్రామాల్లోని కూలీల వలస నివారణకు విరివిగా ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఏపీడీ మధుబాబు, క్షేత్ర సహాయకులకు సూచించారు. మంగళవారం ఆయన క్షేత్ర సహాయకులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే పండ్ల తోటల పెంపకం, చెరువుల ఆయకట్టు కాలువలు మరమ్మతులు, మూగ జీవాలకు తాగునీటి సౌకర్యానికి ఇంకుడు గఉంతల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతోపాటు పాఠశాలలు, సచివాలయాలు, ప్రభుత్వ భూముల్లో మొక్కల పెంపకం చేపట్టి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పురాతన బావుల పూడికతీతలు, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో ఏపీవో అంజనప్ప, ఇంజినీర్ రామన్న, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణ, నాగార్జున శేఖరమ్మ, సిబ్బంది రామచంద్ర, ఆయేషా, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌పై దాడిని ఖండించిన టిడిపి, జనసేన

పెద్దమండ్యం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



ఆదివారం రాప్తాడులో జరి గిన జగన్‌సిద్ధం సమావేశంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ క్రిష్ణపైదాడిని పెద్దమండ్యం టిడిపి మాజీమండల అధ్యక్షుడు, సిద్దవరం ప్రసాద్, జనసేననాయకులు అష్రాఫ్, నాగూర్‌వల్లి, విలేకర్లు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై అమానుషదాడులకు పాల్పడడం దుర్మార్గం అన్నారు. భవిషత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు దాడినిచేసినవారిని గుర్తించి వారిపైహత్యాయత్నం కేసులు పెట్టాలని పిలుపుని చ్చారు. జగన్‌ముఖ్యమంత్రిగా మళ్ళీఅధికారంలోకి రావాలనుకుంటే, చేసిన అభివృద్ధి పనులు, చేయబోయే అభివృద్ధి పనులు గురించి ప్రజలకువివరించాలికాని, ప్రతి పక్షనాయకులను తిట్టడం, చేతి షరట్ కాలర్ మడతపెట్టడం, చంద్రబాబు, పవన్, లోకేషల కటౌట్‌లను కొట్టడం తన్నించడం, తిట్టడం నీఅవినీతి, దౌర్జన్యపాలనకు నిదర్శ నం అన్నారు. 10రూపాయాలుఇచ్చి మేలుచేశానని చెప్పడంకాదు, ధరలుపెంచి వారి నుండి వంద వసూలుచేస్తున్నట్లు చెప్పాలని హితవు పలికారు.

## దాడిని ఖండిస్తూ సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా, రాస్తారోకో

మదనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



అనంతపురం జిల్లాలోని రాప్తాడ్ సిద్దం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ పై వైకాపా నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. టిడిపి, జనసేన, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, బహుజన, వీసీకే, బీవైఎస్, మాలమహానాడు, కులసంఘాలు, విఆర్‌ఎస్‌ఎస్, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ధర్నాలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే రమేష్, జనసేన కో కన్వీనర్ రాందాస్‌చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, మైఫోర్స్ మహష్, కాంగ్రెస్ రెడ్డిసాహెబ్, సిపిఎం శ్రీనివాసులు, సిపిఐ సాంబశివ, బివైఎస్ అధ్యక్షులు పునిత్‌లు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో పాత్రికేయులకు రక్షణ లేకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతు న్న వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి పత్రికలను రెచ్చగొట్టడం వల్లే నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఏద్దేవా చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ రఫిక్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు ధర్నాలో పాల్గొని ఏఓకు వినతిపత్రం అందజేశారు.

## తవళం శివాలయం పునర్‌నిర్మాణం పనులు వేగవంతం

నిమ్మనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం తవళం పంచాయితీ అటవీప్రాంతంలో గల శివాలయ పునర్‌నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.కోటితో మంజూరు జరుగుతున్న పనులను రోజు రోజుకు వేగవంతంగా చేస్తున్నారు. రాబోయే మహాశివరాత్రికి గర్భగుడిలోని పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.

## సమరబేరీ ర్యాలీని జయప్రదం చేయండి

జనసేన నాయకులు రామాంజనేయులు

మదనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



మదనపల్లె జిల్లా సాధనకై నేడు బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో జరగబోయే సమరభేరీ ర్యాలీని జయప్రదం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు శ్రీరామ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ర్యాలీకి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించేవరకు ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. శ్రీచందు చేపడుతున్న సమరబేరీ ర్యాలీకి నాయకులు అందరూ సంఘీభావం తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షులు జగదీష్‌బాబు, నాయకులు శంకర, చంద్రశేఖర్, సోనూ, శ్రీనాథ్, సత్యారెడ్డి, శివ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయమంటే ఓ వర్గానికే న్యాయమా

టిడిపి రాజంపేట పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్

మదనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :




సామాజిక న్యాయం అంటూ ఓ సామాజిక వర్గానికే న్యాయం చేయడం కాదని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జే.వెంకటేష్ తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాధనంతో సిద్దం సభను నిర్వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి 900లకు పైగా ఇచ్చిన నామినేటెడ్ పదవుల్లో తమ సామాజిక వర్గానికి 720పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లోనూ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు నాయకులు చేత మట్టి, ఇసుక, మద్యం తదితర వనరులను దోచుకునే మీరు సామాజిక న్యాయం గురించి మాట్లాడడం భావ్యం కాదన్నారు. నిజాలను నిగ్గుతేల్చే పాత్రికేయులపై కూడా దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రజా వ్యతిరేక విధనాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుబాబు, కత్తి రామ్మూర్తి, రమణ, మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తా

తహశీల్దార్ శ్రీనివాసులు

రామసముద్రం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు స్థానిక విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టినా రైతులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై ఇక్కడకు వచానని రైతులకు వన్‌బి, అడంగల్స్, విద్యార్థులకు సర్టిఫికెట్ల విషయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. అంతేకాకుండా ప్రజాసమస్యలపై స్పందిస్తూ దీంతోపాటు రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## యువ నేత చొరవతో బాధితులకు సీఎం సహాయ నిధి

కలికిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



కలికిరి మండలం ఎంపీపీ నూర్జహాన్ తనయుడు వైసీపీ మైనార్టీ యువ నేత వేంపల్లె బావాజీ చొరవతో అనారోగ్యంతో బాధపడుతున్న 2 కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం బాధితులకు అందజేశారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇదయతుల్లా అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని మైనార్టీ యువ నేత వేంపల్లె బావాజీ, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి రాజంపేట పార్లమెంటు సభ్యుడు వెంకట మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో సీఎం సహాయ నిధి కింద రూ.లక్ష సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయడం జరిగింది. ఈ ఆర్థిక సాయాన్ని యువ నేత బావాజీ బాధితులకు అందజేశారు. ఇటీవల వెంకటేశ్వర పురంలో దళిత కుటుంబానికి చెందిన కృష్ణమ్మ కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని కలికిరి మండలం వైసీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ మధు, వైసీపీ మైనార్టీ యువనేత బావాజీలు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబానికి సీఎం సహాయ నిధి కింద రూ.లక్ష మంజూరు చేయించి సాయాన్ని ఎస్సీ సెల్ నాయకుడు మధు, యువనేత బావాజీలు ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితురాలు కృష్ణమ్మకు అందజేశారు.

## క్షయవ్యాధి రహిత గ్రామంగా గూడరేవుపల్లె

పీలేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



క్షయవ్యాధి అతి సాధారణ అంటు వ్యాధి అయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకమని పల్లె ప్రజలతో పీలేరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గూడరేవుపల్లెలో మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణ పీలేరు యూనిట్ పరిధిలోని కేవి.పల్లె, కలకడ, పీలేరు మండలాల్లో ఏడు గ్రామ పంచాయతీలు క్షయ వ్యాధి రహిత గ్రామ పంచాయతీలుగా నిర్ధారించడం జరిగిందని, క్షయ అనుమానిత రోగిని సకాలంలో గుర్తించడం, రోగి నిర్ధారణ(డాట్స్) ద్వారా క్షయ రోగికి ప్రతిరోజు క్రమం తప్పకుండా మందులు ఇవ్వడం పోషకాహారం సకాంలో అందేటట్లు చూడటం ప్రభుత్వ ప్రోత్సాహకాలు రూ.3వేలు అందించడం మొదలగు ప్రత్యేక నిబంధనలకు లోబడి టీబీ వ్యాధి రహిత గ్రామ పంచా యతీగా గుర్తించడం జరుగుతుందని తెలిపి క్షయతో నివారణ పొందిన రోగిని అభినందించి ఉపకేంద్రంలో సంబంధిత రికార్డులను డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల క్షయ నివారణాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, హెచ్‌ఈ కొండయ్య, టీబీ యూనిట్ అధికారులు మోహన్, పవన్, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## బిజెపిచే శివాజి జయంతి వేడుకలు

మదనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



పట్టణంలోని బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు భర్నేపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజి మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భర్నేపల్లి రవికుమార్ మాట్లాడుతూ శివాజి మహరాజ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. హిందూ సంరక్షణకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. శివాజి యువతకు స్ఫూర్తిదాయకులని తెలిపారు. శివాజిని ఆదర్శంగా తీసుకొని యువకులు అంతా దేశరక్షణకు, హిందూ రక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోసూరి భవాని, మురళిమోహన్, కొండయ్య, వెంకటరమణ, సంతోష్, గణపతి, మల్లేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 22న కలికిరిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి వేడుకలు

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



స్వర్గీయ సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి వేడుకలు జరుగనున్నట్లు రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలికిరి పట్టణంలోని ధరణి హోటల్ ఆవరణలో ఈనెల 22 గురువారం ఉదయం 10 గంటలకు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి పదేళ్ల ముందు బ్రిటీష్ దుష్టపాలనపై ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడని కొనియాడారు. రాయలసీమలో రాయల కాలం నుంచి పాలెగాళ్ల ఉండే వారని అందులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకరని ఆంగ్లేయుల దౌరతనాన్ని ఎదురించి వీరమరణం పొందారని అన్నారు. ఈకార్యక్రమానికి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్యనారాయణరెడ్డి కోరారు.

## జర్నలిస్టులపై దాడులు పిరికిపంద చర్య!

నల్ల బ్యాడ్జీలతో నాలుగు రోడ్ల కూడలిలో నిరసన

పీలేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



జర్నలిస్టులపై దాడులు పిరికిపంద చర్య అంటూ జర్నలిస్టులు ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు నిరసన గలమెత్తారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో మానవహారం చేపట్టి గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ ప్రభుత్వ సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలదాడులు చేయడం ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. ఆంధ్రజ్యోతి విలేఖరివా అంటూ అడిగి కాళ్లతో తన్ని కర్రలతో బాధడం బాధాకరమన్నారు. ఒక్క సిరా చుక్కతో లక్ష మెదళ్లలో కదలిక తెచ్చే వారే విలేఖర్లు అని వారిపై దాడిచేయడం అమానుషమని జర్నలిస్టులు కన్నెర్ర చేస్తే ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వ లోపాల్ని ఎండగడుతూ వ్యవస్థలో అవతకతవకల్ని ఎత్తి చూపాయని, పత్రికల్లో వచ్చే కథనాల్లో వివరణ ఇవ్వాలని లేదా సరిదిద్దుకో వాలే తప్ప దాడులు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. అనంతరం నాలుగురోడ్ల కూడలి నుంచి ర్యాలీగా వెళ్లి ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా దాడులకు పాల్పడిన వైసీపీ అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని తహశీల్దారు మహబూబ్‌బాషా, సీఐ మోహన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, తెదేపా , జనసేన పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు అందరూ పాల్గొని జర్నలిస్టుపై జరిగిన ఘటనపై ఖండించారు.

## సంఘటితంగా ఉన్న పెత్తందారుల ముఠా వైకాపా

పీలేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



రాష్ట్రంలోని కరుడుగట్టిన భూస్వామ్య బూర్జువా మనస్తత్వాలు కలిగిన వారందరూ సంఘటితంగా ఉన్న పార్టీ వైకాపా అని పీలేరు మండలం తెదేపా మీడియా కోఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల పైనే కాకుండా ప్రజల మద్దతుతో గెలిచిన ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ఎమ్మెల్యేలపై సైతం పెత్తనం చెలాయిస్తూ వారి నియోజకవర్గాలలో కూడా వారి మాటకు విలువ లేకుండా చేస్తున్న నాయకులు ఉన్న పార్టీ వైకాపా అన్నారు. అటువంటి పార్టీ నాయకులు తమది పేదల పక్షమని, తెదేపా పెత్తందారుల పక్షమని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. 1983లో ఆవిర్భవించినప్పటి నుంచి తెదేపా లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల వారిని నాయకులుగా తయారుచేసిందన్నారు. వైకాపాలో రాజకీయంగా పుట్టి వైకాపాలో పెరిగి వైకాపాలోనే నాయకులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులను ఒకరినైనా చూపించాలని ఆయన సవాల్ చేశారు. కష్టకాలం వచ్చినప్పుడు జంతువులు కూడా తమ పిల్లల్ని కాపాడుకుంటాయని కానీ ప్రస్తుత ఎన్నికలలో తనకు నష్టం వస్తుందన్న భయంతో జగన్‌మోహన్‌రెడ్డి చాలామంది ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులను నట్టేట ముంచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ వైకాపా అరాచకపాలనకు చమరగీతం పాడేందుకు సిద్దంగా ఉన్నారని ఎన్నికల తరువాత ఫ్యాను రెక్కలు తెగి విలవిలలాడటం ఖాయమన్నారు.

## సీఎం సహాయ నిధులు అందజేత

పీలేరు, ఫిబ్రవరి 19ప్రభాతవార్తః



సీఎం సహాయనిధులు స్థానిక మండల కేంద్రంలోని కష్ణమ్మకు అందజేయడం జరిగింది. స్థానిక మండల కేంద్రంలోని వెంకటేశ్వర పురానికి చెందిన కష్ణయ్య కుమారుడు అనారోగ్య కారణాల వల్ల మరణించడంతో కుటుంబం ఆర్థిక భరోసా కోల్పోయారని సదుద్దేశ్యంతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్ వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మధు చొరవతో సోమవారం కష్ణమ్మ గృహం వద్దకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కు రూ.లక్షను అందజేయడం జరిగింది. ఈసందర్భంగా కష్ణమ్మ మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక భరోసా లేని సమయంలో ఈసహాయం అందజేయడం మాకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కన్న బిడ్డలాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఈ సహాయం అందజేసినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనారిటీ యువనేత వేంపల్లె బావాజీ, రమేష్, నవీన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## పాత్రికేయుడిపై దాడి సిగ్గుచేటు

మదనపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి సిద్దం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేయటం సిగ్గుచేటని బహుజన యువసేన కన్వీనర్ పునిత్ విమర్శించారు. పాత్రికేయుడిపై దాడికి నిరసనగా బహుజన యువసేన ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను కవర్ చేయటానికి వెళ్లిన ఫోటోగ్రాఫర్‌ను వైసిపి కార్యకర్తలు విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి, అధికార పార్టీనాయకులు ఇది ప్రజాస్వామ్యం అనుకుంటున్నారా, లేక గుండాల రాజ్యం అనుకుంటున్నారో అలోచించుకోవాలన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ది వుంటే ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయించాలన్నారు. లేనిపక్షంలో రాబోవు కాలంలో బహుజన యువసేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త అందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు హరీష్, సుధాకర్, ఆది, చల్లపల్లి శశి, కటింగ్ బాలు, జగ్గా, దేవేష్, శాండీ, గాంధీపురం శశి తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు టీచర్లను వేధిస్తున్నారు

బద్వేలు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



జిల్లాలోని కార్పోరేట్ యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు టీచర్లను వేధిస్తున్నారని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంటా వెంకటయ్య అన్నారు. ప్రైవేటు టీచర్లు విద్యాబోధన చెప్పనీయకుండా, అడ్మిషన్ల పేరుతో వేదిస్తూ అరకొర జీతాలతో ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. టీచర్లు చదువు చెప్పడానికి వెళ్లాలా లేక అడ్మిషన్ల చేయాలా అని అయోమయస్థితిలో ఉన్నారని, కార్పోరేట్ స్థాయిలో ఉన్న పాఠశాలలు ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 27 ప్రకారం టీచర్లు, విద్యార్థులకు చదువు చెప్పడానికి మాత్రమేనని అడ్మిషన్లు క్యాంపెయిన్లు చట్ట వ్యతిరేక కార్యక్రమమని చట్టంలో ఉన్నప్పటికి కార్పోరేట్ విద్యాసంస్థలు లెక్క చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. వేదిస్తున్న యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కోరారు.

## ముంపు ప్రాంత వాసులకు ఇళ్ల స్థలలు కేటాయించాలని ధర్నా

బద్వేలు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



గోపవరం, అట్లూరు మండలాలలోని సోమశిల మునక ప్రాంత వాసులకు ఇళ్ల స్థలాలు, భూములు కేటాయించాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో బద్వేలు రూరల్ కార్యదర్శి వెంకటేష ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్.వెంకటాపురం, రంగంపల్లె, చలంగారిపల్లె , ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అట్లూరు క్రాస్‌రోడ్డులో మునకప్రాంత వాసులకు ఇంటి స్థలు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగంపల్లె దళితులకు ఇచ్చిన సర్వేనంబరు 1779 గత ప్రభుత్వంలో 80 మందికి డీకేటి పట్టాలు ఇచ్చారని, అదేవిదంగా కలెక్టర్ అనుమతి లేకుండా మూడు సెంట్ల స్థలాన్ని 2 సెంట్లుగా మార్చుకుని దొంగ అనుబంధ ఫారాలను సృష్టించుకుని గతంలో వీఆర్‌వోగా పనిచేసిన వారి ఫోర్జరీ సంతకాలతో దొంగ అనుబంధ ఫారాలను తయారు చేసుకుని అనేకమంది భూ కబ్జాలకు పాల్పడుతున్నారని మరికొంమంది డీఫారాలను ఏర్పాటు చేసుకుంటూ వామపక్ష నేతలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గోపవరం మునక ప్రాంతం వారికి 1663 , 1662 సర్వేనంబర్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యరకమంలో సీపీఎం నాయకులు జయరాజు, రాంబాబు, లక్ష్మిదేవి, అంజనమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమనుషమని జమ్మలమడుగు ప్రెస్‌క్లబ్, ప్రజా సంఘాల నేతలు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చివరగా జమ్మలమడుగు ఆర్డీవోకు, డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు.

## పాత్రికేయునిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

చిట్వేలి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



సిద్ధం బహిరంగ సభలో ఆదివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాక్షిగా ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ కృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా అధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మండల బాధితుడు కేశం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాతలతో నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియపరుస్తూ సమాజ మార్పునకు తన వంతుగా కృషి చేసే పాత్రికేయులపై దాడి చేయడం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని మండిపడ్డారు. బాధితుడికి న్యాయం చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి పథంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

వీరబల్లి, ఫిబ్రవరి 19, ప్రభాత వార్త :



మండలంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల నందు 2021లో ప్రిన్సిపల్ ఎఫ్‌ఎసిగా స్వీకరించిన జి. రఘురామయ్య కృషితో కళాశాల ప్రగతి పథంలో ముందుకు దూసుకపోతుంది. కళాశాల యందు మౌళిక వసతుల కల్పనలో భాగంగా దాతల సహకారంతో రూ. 40000 వేలు ఖర్చు పెట్టి మంచినీటి పైపులైన్ నిర్మాణం చేపట్టి విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించడం, కళాశాల ఆవరణంలో దాదాపు 200 చెట్లు పెంపకం వలన పచ్చని అహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం దాతల సహకారంతో 10 లక్షల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు మెరుగైన క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేయించి క్రీడాభివృద్ధికి దోహద పడడం, నాడు నేడు పనులలో సొంత పర్యవేక్షణలో రక్షణ వలయం, డిజిటల్ టీవీలు, స్టేజీ నిర్మాణం, మరుగుదొడ్లు, ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం, 2021 నుండి ప్రతి సంవత్సరం పల్లె పల్లెకు తిరిగి 70 మంది విద్యార్థుల సంఖ్యను పెంచడం, 2021–22లో కడప జిల్లాలోనే మొదటి స్థానం నిలపడం, 2022– 23లో ద్వితీయ సంవత్సరం ఫలితాలలో మొదటి స్థానంలో నిలపడం జరిగినది. అలాగే కళాశాలకు రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లను మంజూరు చేయిం చి ప్రతి క్యాంపులు నిర్వహించి పరిశుభ్రత కార్యక్రమాలు, చెట్ల పెంపకం, అంటు వ్యాధు లు, ఓటు నమోదు వినియోగంపైన అవగాహనసేవలను గుర్తించి 2022లో ఆకేపాటి ఫౌండేషన్ వారు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డుని ఇవ్వడం, అన్నమయ్య జిల్లాలో 2024 జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్‌కు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. రఘురామయ్య మాట్లాడుతూ రాబోయే రోజులలో మరింత కృషి చేసి విద్యార్థుల సంఖ్యను, ఫలితాలను పెంచుతామని తెలియజేశారు.

## 50 కుటుంబాలు తెదేపాలో చేరిక

కేవి.పల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ నుంచి వైసీపీ నుంచి మాజీ సర్పంచి జయశంకర్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు సోమవారం సాయంత్రం కలికిరి మండలం నగరిపల్లెలో తెదేపా జాతీయ నేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నివాసంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. అనం తరం కిశోర్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి వచ్చిన వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి ఎల్లవేళలా పార్టీ అండదండలు ఉంటాయన్నారు. కార్యకర్తలు అధైర్యపడకండి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

# విద్యార్థినులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

కాశినాయన,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:



మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదవ తరగతి, ఇంటర్ చదువుతున్న బాలికలకు సోమవారం వివేకనంద ఫౌండేషన్ సంస్థ ఆద్వర్యంలో పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన హెచ్.పి.గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కత్రిమల ఓబులేసు ఆర్థిక సహకారాం అందించడమే కాకుండా విద్యార్థినులతో మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల ఎవరైతే ప్రేమగా ఉంటారో వారికి భగవంతుడి ఆశీర్వాదాలు ఉంటాయని తెలిపారు. వివేకనంద ఫౌండేషన్ సంస్థ గౌరవ సలహాదారుడు రాజోలి శ్రీధర్ రెడ్డి ప్రసంగిస్తూ పరీక్షల్లో విజయం సాధించడానికి సాయశక్తులా కృషిచేయాలన్నారు.ఒక్కసారి అపజయం కలుగుతుంది.అలాంటప్పుడు కృంగిపోకుండా మళ్ళీ ప్రయత్నించాలని విద్యార్థులతో స్పూర్తి నింపాడు.సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ వివేకనంద ఫౌండేషన్ ఎల్లప్పుడూ విద్యార్థులలో స్ఫూర్తి నింపడానికి ప్రయత్నిస్తూనే ఉంటుందన్నారు. విద్యార్థి జీవితంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ దశలో కీలకమైనవి.అందులోనూ ఈ విద్యార్థులు టీనేజ్ దశలో ఉంటారు కాబట్టి,పరీక్షలు వస్తున్నాయంటూ ఒకరకమైన ఉద్వేగంతో,ఒత్తిడితో ఉంటాయన్నారు.వీరిలోని వత్తిడిని తొలగించి ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలన్నారు.అనంతరం 67 మంది బాలికలకు ఎగ్జామ్ ప్యాడ్స్,పౌచ్‌లు,స్కేల్లు.పెన్నులు,పెన్సిల్లు,రబ్బర్లు,మెండర్లు తదితర వంటివి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మెర్సి,ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బద్వేలు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:




పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని వీరారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా 4వ రోజు సోమవారం గుంతపల్లె నగర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వివిధ రకాల వ్యాధుల భారిన పడతారని, కావున ప్రతి ఒక్కరూ ఈ అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు, సిబ్బంది మునెమ్మ, పద్మావతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

కడప లీగల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.శ్రీదేవి, సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లను సంప్రదించవచ్చున్నారు.

# ఘనంగా సామ్రాట్ సాహో ఛత్రపతి శివాజీ జయంతి

– పలు చోట్ల అన్నదాన కార్యక్రమం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె కోడూరు ప్రాంతాల్లో ఉన్న జీవన జ్యోతి ఆనంద నిలయం రెడ్డిపల్లి ఎస్టీ కాలనీలో వృద్ధులకు పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి శివాజీ జయంతి సందర్భంగా ఆయన కీర్తి ప్రతిష్టలను ఆయన జీవిత గాధను డా.బి.ఆర్.రమణ సీనియర్ పాత్రికేయులలకు వివరించి విశదీకరించారు. అంబేద్కర్ ఆశయ సాధనతో శివాజీ ధీరత్వంతో దేశభక్తితో ప్రతి విద్యార్థి బాల్యం నుంచి అలవర్చుకొని యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా పౌరుషంతో పట్టుదలతో సమాజంలో మెలిగి పెద్దలను, స్త్రీలను తల్లిదండ్రులను గౌరవించి సమాజ శ్రేయస్సుకు పాటు పడుతూ దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశభక్తిని నాటుకోవాలన్నారు. శివాజీ మహరాజ్ లాంటి గొప్ప యోధుడు ప్రపంచ దేశాల్లోనే లేరని అలాంటి మహనీయుడు మన భారతదేశంలో పుట్టడం ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం రైల్వేకోడూరు రైల్వే స్టేషన్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, సుబ్బరామయ్య, దార్ల రమణ, పి.ఈశ్వరయ్య, హరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

చాపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వందే అని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణం నందు సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి పట్టు కొమ్మ లాంటిదని కొనిఆడారు. వీరి సేవలను గుర్తించి ప్రోత్సాహకంగా ప్రభుత్వం సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర విభాగాలుగా ఏర్పాటుచేసి ప్రోత్సహించడం గర్వకారణం అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటి సిఫార్సు ద్వారా అందేవని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అర్హత ప్రామానికంగా వాలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందజేయడం మన ప్రభుత్వ గొప్పతనం అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకోవాలంటే వేచి చూడాల్సిన పరిస్థితి అని, నేడు వాలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. కరోనా కష్టకాలంలో కూడ వాలంటీర్ల సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం వాలంటీర్లకు ప్రోత్సహకంతో పాటు శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్షుమయ్య, ఎంపీడీఓ మహబూబ్ బి, సచివాలయాల కన్వీనర్ అన్నవరం రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ భూషనం, కర్ణాటి నారాయణరెడ్డి, ఈఓపిఆర్డి రాధా కృష్ణవేణి,పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత ఈ సెట్ శిక్షణా కేంద్రం ప్రారంభం

రాయచోటి, ఫిబ్రవరి 19, ప్రభాత వార్త :

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉచిత ఈ సెట్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రికల్ అండ్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాలలో నిష్ణాతులైన అధ్యాపకులచే ఉచిత ఈ సెట్ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. శిక్షణలో భాగంగా ప్రతి రోజూ సబ్జెక్టు నందు, వారాంతంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ శిక్షణకు హాజరగు విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం అందిస్తామని వివరించారు. కావున ఈ అవకాశాన్ని రాయచోటి పట్టణ పరిసర ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

# పుష్పయాగంతో ముగిసిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లిలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఈ నెల 10న ధ్వజారోహణంతో ప్రారంభమై సోమవారం పుష్పయాగంతో ముగిశాయి. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, ఆలయ అర్చకులు రమేష్‌బాబులు ఎస్వామి వారితో పాటు శ్రీదేవి, భూదేవిలకు స్నపన తిరుమంజనం సమర్పణ అనంతరం ప్రత్యేక పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి సన్నిధిలో గోవింద నామ స్మరణతో భజన కార్యక్రమాలు, వెంకటేశ్వర స్వామి స్తోత్రాలు ఆలపించారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజు కావడంతో పెద్దఎత్తున భక్తులు హాజరై ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమాలను టీటీడీ ఏఈవో గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, రమేష్, రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు రక్షణ కల్పించలేని ప్రభుత్వానికి పరిపాలించే అర్హత లేదు

తెదేపా జాతీయ నేత నల్లారి

పీలేరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్తః



అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్ర జ్యోతి ఫోటోగ్రాఫర్ కష్ణపై వైసీపీమూకల దాడి హేయమైన చర్య అని తెదేపా జాతీయ నేత, నియోజకవర్గ బాద్యులు నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అన్నారు. రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభ జర్నలిస్టులపై దాడికి సిద్ధం సభగా మారిందన్నారు. విధి నిర్వహణలో ప్రతిరోజు ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా సమాచారాన్ని అందించి ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా నిత్యం ప్రజల్లో ఉండే జర్నలిస్టులకు రక్షణ కల్పించలేని చేతగాని ప్రభుత్వం ప్రజలకు అవసరమా అన్నారు. ఆదివారం రాప్తాడు సిద్దం సభలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌ను నువ్వు ఆంధ్రజ్యోతా అంటూ అడిగి కాళ్లతో కర్రలతో వైసీపీ అల్లరి మూకలు చితకబాధడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలను రెచ్చగొట్టడం మీదిపై దాడులకు ప్రేరేపించడం వైసీపీ నాయకుల నైజమని వాటిని మానుకోవాలన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు జర్నలిస్టులకు భద్రత కరువైందని సిద్ధం సభలో దాడిజరిగిన ఘటనపై వెంటనే స్పందించి వారిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో తెదేపా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని వైసీపీ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.

## జగన్ సంక్షేమ పథకాలను ప్రజలే గుర్తు చేయడం సంతోషకరం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నేపథ్యంలో జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలే గుర్తు చేయడం సంతోషం కలిగిస్తోంది ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మూడో వార్డులో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఇంటింటి ప్రచారం నిర్వహించిన వార్డులలో లభించిన ఆదరణ 3వ వార్డులో కూడ లభించిందన్నారు. మూడవ వార్డు ఇంచార్జ్ కృష్ణార్జున రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 80లక్షల నిధులతో రోడ్లు, కాలువలు నిర్మాణం తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. జగన్ సంక్షేమ పథకాల ద్వారా 24కోట్లు నేరుగా మహిళల ఖాతాలలో జమ చేశామన్నారు. జగన్ ప్రజా సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరింది అన్నారు. కేవలం సాంప్రదాయ బద్ధంగా జరుగుతున్న ఎన్నికలలో ఫలితాల కోసమే తప్ప ప్రజలు జగన్ వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహా రెడ్డి, రాయలసీమ పోలీస్‌కంప్లైంట్ అథారిటి మెంబర్ కాకర్ల నాగేశరెడ్డి, వార్డు ఇంచార్జ్ కృష్ణార్జునరెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ బోర్డు సభ్యులు కాకర్ల నాగేశారెడ్డి, డీలర్ మహబుబ్ బాష, మండల అధ్యక్షుడు సానబోయిన శేఖర్‌యాదవ్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామిశెట్టి బాబు, కౌన్సిలర్లు వరికూటి ఓబుల్‌రెడ్డి, కమాల్‌బాష, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి కంభం వెంకటేశ్వర్లు మరియు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మీడియాపై దాడి సిగ్గు చేటు

రాయచోటి, ఫిబ్రవరి 19, ప్రభాత వార్త :



ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ జర్నలిస్టు శ్రీకృష్ణపై రాప్తాడు వైసిపి సిద్ధం సభలో జరిగిన దాడిపై స్పందిస్తూ అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ ఎదుట విలేకరులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేస్తున్న పాత్రికేయులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు అభివర్ణించారు. అధికారం శాశ్వతం కాదు ఎన్నో పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి పోతుంటాయి కానీ మీడియా వ్యవస్థ శాశ్వతం అనే విషయాన్ని అధికార వైసిపి పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని, వైసిపి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తే మీడియా వారికి భయపడడం ఎందుకని వారు ప్రశ్నించారు. రాప్తాడు సిద్ధం సభలో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసిపి అల్లరి మూకలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు, ఎపియుడబ్ల్యూజె సభ్యులు పాల్గొన్నారు.

# సిద్దేశ్వరస్వామి పున స్థిర ప్రాణ ప్రతిష్ట మహోత్సవం

చక్రాయపేట,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:



నేటి నుండి సురభి సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని సరవి బండ్లయ్య గారి పల్లె సమీపంలో ఉన్నటువంటి సిద్దేశ్వర స్వామి ఆలయం 20,21,22 తేదిలలో పునా ప్రారంభం నుంచి ఘనంగా పూజలు నివసిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.సిద్దేశ్వర స్వామి ఆలయ చరిత్ర ద్వాపర యుగం నందు కలియుగ ప్రారంభ సంధి కాలమున కురు పాండవ సంతతికి చెందిన జనయే జయ మహారాజు గారు నాగదోష నివానర్ధమున ఏకకాలంలో ప్రపంచ వ్యాప్తంగా కోటి శివాలయంలోనూ ప్రతి చేయించే అందులో ఈ సిద్దేశ్వర స్వామి ఆలయం ఒకటని చెప్పుకోవచ్చు గుడి నిర్మాణం జరిగి 5120 సంవత్సరాలు కావాల్సింది వస్తి శ్రీ శోభ కృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం శశిర రుతువు మాఘమాసం శుక్ల పంచమి శ్రేయోదశి గురువారం 20-22/02/2024 తేదిన ఉదయం 3:29 గంటల నుండి 4:29 లోగా శుభ బ్రహ్మాలగ్నం నందు కడప జిల్లా చక్రాయపేట మండలం సురవి గ్రామం నందు బండ్లయ్యగారిపల్లి సమీపాన వైతర నీ నది పొద్దున వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం నందు మహాగణపతి మాత పార్వతి శ్రీ సుబ్రహ్మణ్యం శ్వర నవగ్రహ నందీశ్వర నారాయణ గజస్థంబం శిఖర ప్రతిష్ఠ మొదలగు కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆలయ పెద్దలు గ్రామ పెద్దలు అందులో కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నేటి నుండి సురభి సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ రోజు ఉదయం సిద్దేశ్వరం స్వామి ఆలయం నుండి ప్రతిష్ట విగ్రహాలు తోపాటు మరిన్ని విగ్రహాలు కలిసి బాలయ్య గారి పల్లి నుండి ప్రారంభమై లక్ష్మీపురం పాయలో పల్లి నుండి ఊటుకూరువాళ్లపల్లి బోడిగుడ్డుపల్లి కుప్పగుట్టపల్లి మల్లిక వాళ్ళ పల్లి మాహబూబ్నగర్ బాల తిమయ్య గారి పల్లి నాగలకట్టపల్లి అగ్రహారం పోలిశెట్టిపల్లి కొమిటి పేట గాజుల పేట హరిజనవాడ రెడ్డివారి పల్లి బండ్లయ్య గారి పల్లి పల్లెల మీదగా విగ్రహాలు వస్తాయని గ్రామ ప్రజలు భక్తాదులు వీక్షించాలని సిద్దేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు పెర్కొన్నారు.

# అత్యాధునిక వసతులతో సురేష్ కంటి ఆసుపత్రి



కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:

కడప కేంద్రంగా అ త్యాధునిక వసతులతో సు రేష్ కంటి ఆసుపత్రిని సోమవారం ఏర్పాటు చే యడం ఎంతో అభినందనీ యమని వైద్య వృత్తిని వ్యాపార ధోరణితో కాకుం డా సేవా తత్పరతతో వైద్య సేవలను పేదలకు అందేలా చూడాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. కడప నగరం నడిబొడ్డున రాజీవ్ పార్కు రోడ్డులో అత్యాధునిక వసతులతో నిర్మించిన సురేష్ కంటి ఆసుపత్రిని అంజాద్‌బా షా, సీనియర్ రాజకీయ వేత్త పీఏన్ మూర్తిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగర ప్రజలకు జిల్లా వాసులకు అత్యంత ఆధునికమైన నేత్ర చికిత్సలను అందుబాటులోకి తేవడం అభినందనయిామని ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేత డా.ఎ.సురేష్‌బాబును ప్రత్యేకంగా అభినందించా రు. సురేష్ నేత్ర చికిత్సలా విశేష అనుభవం గడించి అనేక ప్రాంతాల్లో తన సేవలను కొనసాగించిన జిల్లా వాసులకు మరింత చేరువలో అత్యాధునిక వసతు లతో ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకమన్నారు. అనంతరం ఆసుపత్రి అధినేత నేత్రాలయ వైద్యుడు సురేష్ మాట్లాడుతూ కడప నగరంలో గత 20 సంవత్సరాలుగా కంటి వైద్యం నిర్వహించి అందరి మన్ననలు పొందా మన్నారు. నగర ప్రజలకు మరింత సేవలు అందించేందుకు అత్యాధునిక వసతుల తో ఆసుపత్రి ప్రారంభించడం జరిగిందన్నారు. వైద్య సేవలు ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముగ్గురాళ్ల అమరప్ప, తోట కృష్ణ, కాపు నాయకులు నారాయణ స్వామి, ఎస్వీ రాము, కె.కృష్ణ మూర్తి, మస్తాన్, రాయల్, తోట నరసయ్య, పసుపులేటి శ్రీనివా సులు, టింబర్ డిపో శ్రీనివాసులు, నగర ప్రముఖులు, డాక్టర్లు పాల్గొన్నారు.

## అధిపత్య కుల పార్టీలన్నీ బిసి మంత్రమే జపిస్తున్నాయి

రాయచోటి, ఫిబ్రవరి 19, ప్రభాత వార్త :



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తూ వారిని అభివృద్ధికి, అధికారానికి ఆమడ దూరం ఉంచి కేవలం వారి ఓట్ల కోసం మాత్రమే అధిపత్య కుల పార్టీల సంఘాలన్నీ సంక్షేమం, అభివృద్ధి మాటున బిసి మంత్రాన్ని జపిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆరోపించారు. భారతీయ సమాజంలో 54 శాతం ఉన్న బిసిల అనైక్యతను, అమాయకత్వాన్ని వెనుకబాటుతనాన్ని ఆసరాగా తీసుకొని అధిపత్యకుల పార్టీలు వారి ధన, మీడియా, మాఫియా బలాలతో రకరకాల ప్రలోభాలకు గురి చేసి చీలించి పాలించే కుటిల రాజనీతితో మోసపూరితంగా ఓట్లు కొల్లగొట్టి గెలిచి గద్దెనెక్కి తర్వాత బిసిలను పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రణాళికల్లో బిసిలకు అన్నీ చేస్తామంటూ పథకాలను ఎర చూపి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చెయ్యి చూపుతున్నారన్నారు. 139 బిసి కులాలు ఐక్యమైతే అధిపత్య కులాలను అధికారం నుండి దించి రాజ్యాధికారం సాధించటం అంత కష్టమేమి కాదన్నారు. ఇకపై రాజకీయంగా నిలదొక్కుకొని రాజ్యాధికార సాధన కోసం రాష్ట్ర బిసి నేతలమంతా వచ్చే మార్చి 8న అంతిమ సమాలోచనలు జరిపి ఇకపై ఆధిపత్య పార్టీల భరతం పట్టేలా కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేద్దామని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దువ్వూరు నరసింహాచారి, నాగేశ్వరరావు, జి.సుధాకర్, హబీబుల్లా, కెవి రమణ, బాలాజీ, పురుషోత్తం, ఈశ్వరయ్య, నాగార్జునచారి, వెంకటేష్, లింగమూర్తి, ఆదినారాయణ, చంద్రకళ, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

# 2024 ఎన్నికల్లో రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తా

– 50 సంవత్సరాల రాజకీయ జీవితం ప్రజలకే అంకితం – ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:



2024 ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం నుంచి శాసన సభ్యులుగా పోటీ చేస్తానని 50 సంవత్సరాల రాజకీయ జీవితం ప్రజలకే అంకితమని ప్రజలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని ఆర్ఆర్ స్వగృహంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో ఆర్ఆర్ అభిమానులు, ఆత్మీయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. 1962 నుంచి మా తండ్రి ఆర్.రాజగోపాల్‌రెడ్డి, మా పెద్దనాన్న ఆర్.సూర్యనారాయణరెడ్డి, రాజకీయ రంగ ప్రవేశం చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎన్నో సేవలు చేసి ఎన్నో ఉన్నతమైన పదవులు అలంకరించి లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడ్డారని ఆయన తెలిపారు. తన తండ్రి స్వర్గీయ ఆర్.రాజగోపాల్‌రెడ్డి 183లో స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన తెదేపాలో రోడ్డు రవాణా శాఖామంత్రిగా కొనసాగి ఎన్నో అభివృద్ధి కార్యమాలు చేపట్టారని లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో పెద్ద ప్రాజెక్టు ఆయన వెలుగులు స్థాపకుడిగా నిలిచి శంకుస్థాపన చేసి ప్రాజెక్టును అన్ని విధాలా అభివృద్ధి చేసి రామాపురం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలకు సాగునీరు అందించిన ఘనత తన తంనరడిదే అన్నారు. తన పెద్దనాన్న స్వర్గీయ ఆర్.సూర్యనారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించిన ఘనత ఆర్ఆర్ కుటుంబం దేనని పేర్కొన్నారు. 1999లో లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గ శాసన సభ్యునిగా ఎన్నికై ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంతేకాకుండా 2009, 2014, 2019 ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైనప్పటికీ ప్రజల్లో నా దేవుళ్లుగా భావించి ఎల్లప్పుడూ వారికి అందుబాటులో నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేశామన్నారు. తెదేపా ఇన్‌ఛార్జిగా పని చేస్తూ పార్టీ అధిష్టానం ఆదేశానుసారం ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల మన్ననలు పొందామన్నారు. రాయచోటి శాసన సభ్యుడు 3వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కనీసం రూ.వంద కోట్లు కకూడా అభివృద్ధి పనులు చేయలేదని ఆయన వివమర్శించారు. రాబోయే 2024 ఎన్నికల్లో నన్ను ఒక్క సారి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మోహన్‌రెడ్డి, నర్సా రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, నాగేంద్రరెడ్డి, శంకారపు జయరాం, సర్పంచులు లక్ష్మినారాయణ, కేశవయ్య, చంద్రమ్మ, ఎంపీటీసీలు, రవణమ్మ, గంగయ్య, శ్రీరాములు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు, ఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# 40 కుటుంబాలు జనసేన పార్టీలో చేరిక

బద్వేలు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :



మున్సిపాలిటీలోని 2వ వార్డు శీలంవారిపల్లెలో 40 కుటుంబాలు జనసేన పార్టీలో చేరినట్లు బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త మురళికృష్ణ, బసివిరమేష్‌లు నియోజకవర్గ నాయకులు నందకిశోర్‌లు అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అనేకమందిని పార్టీలోకి ఆహ్వానిస్తుందని వాటిలోభాగంగా సోమవారం బద్వేలు మున్సిపాలిటీలో గోపవరం మండల అధ్యక్షులు మనోహర్, 2వ వార్డు ఇన్‌చార్జి బాల చెన్నయ్యల సహకారంతో వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరడం జరిగిందన్నారు. అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఒక నిబద్ధతతో పార్టీ ని ముందుకు తీసుకెళుతున్నారని, రాబోయే రోజులలో జనసేన పార్టీ ఊహించని స్థాయిలో ముందుకెళుతుందన్నారు. జనసేన పార్టీ క్రమశిక్షణ గల పార్టీగా ముందుకు సాగుతుందని, ఆదరణ పార్టీకి ఎక్కువగా ఉన్నప్పటికీ కష్టపడే వారిని గుర్తించి పార్టీ ముందుకు తీసుకెళుతుందన్నారు.2 వవార్డు శీలంవారిపల్లె నుంచి శీలం వెంకటయ్య, నల్లా కేశవయ్య, రాంబాబు, పెంచలయ్య, నల్లా పెంచలయ్య, నడిగే రమేష్, శ్రీను, రామచంద్ర, కేశవులు, కొంతమంది కార్యకర్తలు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సాదరంగా స్వాగతం పలుకుతూ జనసేన పారీ కండువా కప్పి ఆహ్వానించారు.

# వాలంటీర్లకు సేవా పురస్కారాలు

మైదుకూరు పిబ్రవరి 19, ప్రభాత వార్త :



గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సిఎం జగన్ ఏర్పాటు చేసిన వాలంటీరి వ్యవస్థ ద్వారానే సాధ్యమైందని, అవినీతి ఆస్కారం లేకుండా వాలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమెల్యే రఘురామిరెడ్డి అన్నారు.సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వాలంటీర్లకు సేవా పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి,మునిసిపల్ ఛైర్మెన్ మాచునూరు చంద్ర పాల్గొన్నారు.సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ఎర్పాటు చేసిన సచివాలయం వాలంటీరీ వ్యవస్థలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. దాదాపు 2.62వేల కోట్ల రూపాయలు వాలంటరీ వ్యవస్థ ద్వార ప్రజలకు చేరిందన్నారు.వాలంటరీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఎక్కడే గానీ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు సంక్షేమ ఫలాలు,ధృవీకరణ పత్రాలు మొదలగునవి ఏవైనా కావాలంటె వాలంటరీ ద్వారానె అందుతున్నాయన్నారు, కరోనా మహమ్మారి సమయంలో వాలంటీర్లు ప్రజాసేవ చేశారు.అనంతరము వాలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న,సేవామిత్ర పురస్కారాలు అందించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ జబర్ మియా,మార్కెట్ ఛైర్మెన్ శ్రీమన్నారాయణ రెడ్డి,ఎంపిపి థామస్,వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి,మునిసిపల్ వైస్ ఛైర్మెన్ షరీఫ్,మూలే భరత్ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి అమానుషం

ఏపీయూ డబ్ల్యుజే అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :

అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఫోటోలు సేకరిస్తున్న ఆం ధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ జర్నలిస్టు క్రిష్ణపై దాడి చేయడం సరికాదని ఏపీయూడబ్ల్యుజే అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్, సుదర్శన్ రెడ్డి, రామతీర్థం, కిశోర్‌కుమార్, దేవిరెడ్డి సురేష్, రఘురామిరెడ్డి, ప్రసాద్, హుసేన్‌తో పాటు పలువురు పేర్కొన్నారు. సోమవారం బద్వేలు పట్టణంలోని ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పలువురు రాప్తాడు సమావేశంలో ఫోటో గ్రాఫర్ క్రిష్ణపై దాడికి పాల్పడిన వారిపై అధికారులు, నాయకులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారిపై చట్టపరమైన కేసు నమోదు చేయాలని బద్వేలు తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తూ జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని పలువురు తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న పాత్రికేయులపై ఇప్పటికీ అనేక దఫాలుగా దాడులు జరిగినా ఎక్కడ కూడా ఇంతవరకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టుల సమస్యల పట్ల పరిష్కరిస్తూ ప్రజలకు, అదికారులకు వారధిగా పనిచేస్తున్న మీడియా సోదరులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు గురునాథ్, వివి.రమణ, రఘురాములు , వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, మైఖెల్, సంపత్, రవి, రమేష్, శివశంకర్, మౌలాలి, సుబ్బరాయుడు, జయప్రసాద్, నరసింహతో పాటు పలువురు మీడియా సోదరులు పాల్గొన్నారు.

## మీడియా ప్రతినిదులపై దాడిని ఖండించిన పుట్టా

మైదుకూరు పిబ్రవరి 19, ప్రభాత వార్త :




రాప్తాడు సిద్ధం సభ దగ్గర జరిగిన ఆంధ్రజ్యోతి విలేఖరి పై జరిగిన దాడిని ఖండించిన టిడిపి ఇన్చార్జీ పుట్టా సుధాకర్ యాదవ్, జనసేనా, సిపియం ప్రజా సంఘాల నాయకులు,సిద్ధం సభలో పోటోలు తీస్తున్న ఇద్దరు ఆంధ్రజ్యోతి విలేఖరులపై వైసిపి కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ప్రతినిది కృష్ణను గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వామపక్షాల ఆధ్వర్యంలో పాత్రికేయులకు సంఘీభావం తెలిపారు. తీవ్రంగా గాయపడ్డి కృష్ణాకు వైద్యం చేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారు చేస్తున్న నిరసన ర్యాలీ మైదుకూరు రాయల్ సర్కిల్ నుండి కడప రోడ్డు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేస్తూ నినాదాలు,నిరసనలు చేస్తున్న వారికి సంఘీభావంగా మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జీ పుట్టా సుధాకర్ యాదవ్,జనసేనా పార్టీ ఇంచార్జీ పందీటి మాల్యోత్రా,సిపియం నాయకులు శ్రీరాములు, పీరయ్య, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్త విలేకరులు కావలెను
వార్త దినపత్రిక నందు పనిచేయుటకు క్రింద తెలిపిన మండలాల వారిగా అనుభవజ్ఞులైన విలేకరులు కావలెను.
కడప జిల్లా
కడప కలెక్టరేట్, వల్లూరు, అట్లూరు.
అన్నమయ్య జిల్లా
పుల్లంపేట, సుండుపల్లి, వాయల్పాడు, పెనగలూరు.
సంప్రదించవలసిన చిరునామా:
వార్త ప్రాంతీయ కార్యాలయం, రాజీవ్‌పార్కు దగ్గర, హౌసింగ్‌బోర్డు కాలని, కడప. సెల్: 9848787289, 8919566086.
ఇంటర్వ్యూ తేదీ: 26-02-2024 (సోమవారం)